www.manachourasta.com

# మన చౌరాస్తా

The Complete News way

సంపుటి : 01 | సంచిక : 07 (కాంప్లిమెంటరీ కాపీ) | ఆదివారం | 07.04.2024



మనందరిదీ కుటుంబ

## సంబంధం

నాకు ప్రజలకు ఉన్న సంబంధం రాజకీయాలకు అతీతం. మనందరిదీ కుటుంబ సంబంధం. తెలంగాణ ప్రజల సిపాయిలా ఢిల్లీలో ఉంటా. నా జీవితాంతం చిన్న పిల్లలు పిలిచినా తెలంగాణ వస్తా. ప్రజల స్వప్నం సాకారం చేసేందుకు రాష్ట్రాన్ని ఇచ్చాం. ఈ కొత్త రాష్ట్రం దేశానికే మార్గం చూపాలి. 'మేడిన్ చైనా' కంటే మిన్నగా 'మేడిన్ తెలంగాణ కావాలి..' అని రాహుల్ ఆకాంక్షించారు.

# అన్ని వర్గాలకు న్యాయం చేస్తాం



- జాతీయ మేనిఫెస్టోలో 5 గ్యారంటీలు
- కుటుంబానికి ఏటా లక్ష ఆదాయం
- స్వామినాథన్ సిఫార్సులను అనుసరించి పంటలకు మద్దతు ధర
- మేడిన్ చైనా కంటే.. మేడిన్ తెలంగాణ మిన్న కావాలి
- బీజేపీ ఓ వాషింగ్ మెషిన్
- తుక్కుగూడ జన జాతర సభలో కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ

**హైదరాబాద్, మన చౌరాస్తా :**

దేశంలోని అన్ని వర్గాలకు న్యాయం చేయడమే లక్ష్యంగా కాంగ్రెస్ పార్టీ ముందుకు సాగుతుందని కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ స్పష్టం చేశారు. నరేంద్ర మోదీ ప్రధాన మంత్రి అయిన తర్వాత దేశంలోని పేదలు మరింత నిరుపేదలయ్యారని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ఆరోపణలు చేశారు. ప్రధాని మోదీ కేవలం కార్పొరేట్ వ్యక్తులకు మాత్రమే రుణమాఫీ చేశారు గానీ, రైతులకు రుణమాఫీ చేయలేదని ధ్వజమెత్తారు. తెలంగాణలోని తుక్కుగూడలో నిర్వహించిన జనజాతర సభలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. ఈ సభ సందర్భంగా న్యాయపత్రం పేరిట మేనిఫెస్టో విడుదల చేసిన రాహుల్ గాంధీ.. తాను మేనిఫెస్టో రిలీజ్ చేయడానికే వచ్చానని చెప్పారు. కొన్ని రోజుల క్రితం ఇక్కడే తమ గ్యారెంటీలను విడుదల చేశామని.. ప్రజల గొంతుని వినిపించేలా తాజా మేనిఫెస్టోని సిద్ధం చేశామని అన్నారు. అసెంబ్లీ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ఇచ్చిన వాగ్దానాలను తప్పకుండా నెరవేరుస్తామని హామీ ఇచ్చారు.

తెలంగాణలో ఇచ్చిన హామీలను అమలుచేసినట్లుగానే.. జాతీయ స్థాయిలోనూ కచ్చితంగా అమలుచేసి తీరుతామని ఆ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ అన్నారు.

### ధనవంతులకే రుణమాఫీ..

మోదీ ప్రభుత్వం ధనవంతులకే రూ.16 లక్షల కోట్లు రుణమాఫీ చేసింది. రైతుకు ఒక్క రూపాయి కూడా మోదీ ప్రభుత్వం మాఫీ చేయలేదని రాహుల్ ఆరోపించారు. స్వామినాథన్ సిఫార్సులను అనుసరించి పంటలకు మద్దతు ధర ఇస్తామని ప్రకటకించారు. జాతీయస్థాయిలో కనీస వేతనం రూ.400కి పెంచుతామన్నారు. ఉపాధి హామీ కూలీలకు వేతనం పెంచుతామన్నారు.

### భాజపా ఓ వాషింగ్ మెషీన్

'తెలంగాణలో గత సీఎం ఎలా పనిచేశారో మీ అందరికీ తెలుసు. వేలాది మంది ఫోన్లు ట్యాప్ చేయించారు. రెవెన్యూ, ఇంటెలిజెన్స్ వ్యవస్థలను దుర్వినియోగం చేశారు. ట్యాపింగ్ ఆధారాలు దొరక్కుండా నదుల్లో పడేశారు. బెదిరించి, భయపెట్టి బలవంతపు వసూళ్లకు పాల్పడ్డారు. ఇక్కడ మాజీ సీఎం చేసిందే.. కేంద్రంలో మోదీ చేస్తున్నారు. మోదీ వచ్చే ముందు ఈడీ వస్తుంది. దేశంలోనే భాజపా అతిపెద్ద వాషింగ్ మెషీన్‌గా మారింది. దేశంలోని అవినీతిపరులంతా మోదీ ముందే నిల్చొన్నారు. ఎన్నికల సంఘంలోనూ మోదీ మనుషులున్నారు. ఎలక్టోరల్ బాండ్ల జాబితా చూస్తే ఏం జరిగిందో మీకే అర్థమవుతోంది.'



## రైతులకు ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చాలి

- ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి

2



## జైలుకైనా పోతా.. కానీ.. పార్టీ మారను

- మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు

2



## నీటి సమస్య రానివ్వకండి

- తాగునీటి ప్రత్యేక అధికారి గోపి

3

General News




# ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చాలి

- ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి

**జనగామ, మన చౌరాస్తా :** ఎన్నికల ముందు కాంగ్రెస్ ప్రభుత్వం రైతన్నలకు ఇచ్చిన ప్రతి హామీని వెంటనే నెరవేర్చాలని జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి డిమాండ్ చేశారు. శనివారం బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ పిలుపుమేరకు జనగామ జిల్లా కేంద్రంలో రైతు నిరసన దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పల్లా మాట్లాడుతూ... వెంటనే రైతులకు రూ.2 లక్షల రుణమాఫీ చేయాలని, రైతుబంధు నిధులు రైతుల ఖాతాల్లో జమ చేయాలని, కౌలు రైతులకు హామీ ఇచ్చిన విధంగా నిధులు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ధాన్యానికి మద్దతు ధర అందించడంతోపాటు రూ.500 బోనస్ చెల్లించాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ అసమర్థ పాలన వల్ల రైతులు సాగునీరు అందక పంట నష్టపోయారన్నారు. పంట నష్టపోయిన రైతాంగానికి ఎకరాకు 25వేల రూపాయల నష్టపరిహారం అందించాలన్నారు. దొంగ హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చి నాలుగు నెలలు గడిచిన హామీలు పూర్తి చేయని కాంగ్రెస్‌కు పార్లమెంటు ఎన్నికల్లో తగిన గుణపాఠం చెప్పాలన్నారు. నిరసన దీక్షలో బారాస నాయకులు, కార్యకర్తలతో పాటు రైతులు పాల్గొన్నారు..

## మాట నిలబెట్టుకోండి..



**కాంగ్రెస్ ఎన్నికలకు ముందు ఇచ్చిన మాట ప్రకారం రైతులకు రైతు భరోసా కింద రూ.15 వేలను వెంటనే ఇవ్వాలి. వర్షా లు లేక ఎండిపోయిన పంటలకు రూ.25 వేల పరిహారం ఇయ్యాలి. అధికారం వచ్చిన 4 నెలలు అవుతుంది. కానీ, కాంగ్రెస్ ఒక్క హామీ అమలు చేయడం లేదు. మహిళలకు రూ.2500 ఏమైంది. నోటికొచ్చినట్టు మాట్లాడుతూ రేవంత్‌రెడ్డి సీఎం హోదాను దిగజారుస్తున్నడు. అయినా మాకు కేసీఆరే ఎప్పటికీ సీఎం. రైతులను మోసగిస్తున్న ఈ ప్రభుత్వానికి పార్లమెంట్ ఎన్నికల్లో ప్రజలు గుణపాఠం చెప్పాలి**

- ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి, మాజీ ఎమ్మెల్యే

# జైలుకైనా పోతా.. కానీ.. పార్టీ మారను

- కావ్య ఓటమి తథ్యం
- మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు

**పాలకుర్తి, మన చౌరాస్తా :** పదవుల కోసం పార్టీలు మారినోడు.. నాలుగు సార్లు చిత్తుచిత్తుగా ఓడిపోయిన కడియం శ్రీహరి తన మీద విమర్శలు చేస్తున్నాడని, తన 40 ఏళ్ల రాజకీయ అనుభవంతో చెబుతున్నా కడియం కావ్య ఈ పార్లమెంటు ఎన్నికల్లో ఓడిపోవడం ఖామని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ విధానాలను నిరసిస్తూ శనివారం బీఆర్ఎస్ ఆధ్వర్యంలో నియోజకవర్గ కేంద్రాల్లో రైతు దీక్ష నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు పాల్గొని మాట్లాడారు. తనపై కావాలని కుట్రలు చేస్తున్నారని, ఫోన్ ట్యాపింగ్ కేసులో ఇరికించి జైలుకు పంపే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. జైలుకు పోతే పోతా.. కానీ పార్టీ మారనని ఎర్రబెల్లి స్పష్టం చేశారు. గతంలో రైతుల కోసం మూడు సార్లు పోలీసులతో దెబ్బలు పడ్డానని.. జైలుకు పోయిన



అన్నారు. ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో తనకు ఎలాంటి సంబంధం లేదని చెప్పారు.



# పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి

– సీనియర్ సివిల్ జడ్జి విక్రమ్

**జనగామ, మన చౌరాస్తా:** ప్రతీఒక్కరు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుని ఆరోగ్యంగా ఉండాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి విక్రమ్ అన్నారు. ఏప్రిల్ 7 ప్రపంచ ఆరోగ్య దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా ఆస్పత్రిలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అందరినీ రక్షించే డాక్టర్స్ కూడా ప్రతి సంవత్సరం మెడికల్ చెకప్ చేయించుకోవాలన్నారు. ఒకప్పుడు గవర్నమెంట్ హాస్పిటల్ అంటే భయపడేవారని, ఇప్పుడు పరిస్థితి మారిందన్నారు. ప్రభుత్వ ఆస్పత్రులు చాలా అభివృద్ధి చెందాయన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ సుగుణాకర్ రాజు, లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ చీఫ్ ఎం.రవీంద్ర, అసిస్టెంట్ లీగల్ ఎయిట్ డిఫెన్స్ కౌన్సిల్ జ్యోష్న, అసిస్టెంట్ లీగల్ ఎయిడ్ కౌన్సిల్ శ్రీహరి పాల్గొన్నారు.

# రైతు ఆత్మహత్య కేసులో సర్వేయర్ రిమాండ్

**బచ్చన్నపేట, మన చౌరస్తా :** రైతు రఘుపతి ఆత్మహత్య కేసులో ఒక నిందితుడు రిమాండ్ కాగా.. మరో ప్రధాన నిందితుడు పరారీలో ఉన్నట్లు బచ్చన్నపేట ఎస్ఐ సతీష్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పడమటి కేశవపూర్ గ్రామానికి చెందిన రైతు కొమ్మాట రఘుపతి ఆత్మహత్య చేసుకున్న కేసులో శనివారం మండల సర్వేయర్ కుక్క రవీందర్ ను అరెస్టు చేసి కోర్టులో హాజరుపరచగా మెజిస్ట్రేట్ రిమాండ్ విధించినట్లు తెలిపారు. ఈ కేసులో ప్రధాన నిందితుడైన సీనియర్ అసిస్టెంట్ కొలిపాక సుమన్ పరారీలో ఉన్నాడని, అతడి కోసం గాలింపు చేస్తున్నామని స్పష్టం చేశారు.



# కృష్ణవేణి సేవలు మరువలేనివి

**బచ్చన్నపేట, మన చౌరాస్తా :** మంచి ఉపాధ్యాయురాలిగా, సామాజిక కార్యక్రమాలలో చురుకుగా ఉండే ఉపాధ్యాయురాలు తులసి కృష్ణవేణి అకాల మరణం విచారకరమని విద్యా శాఖ జిల్లా అధికారి రాము అన్నారు. శనివారం తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ బచ్చన్నపేట్ మండల శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన తులసి కృష్ణవేణి సంస్మరణ సభ కనకయ్య అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన డీఈవో రాము మాట్లాడుతూ మంచి ఉపాధ్యాయులను ఎప్పుడు గుర్తుంచుకుంటారని, విద్యార్థుల శ్రేయస్సు కోసం పనిచేస్తూ, చెరగని ముద్ర వేశారని అన్నారు. ఆమె కుటుంబానికి టీఎస్ యూటీఎఫ్ సంఘం ఆధ్వర్యంలో రూ.6 లక్షలు సహాయం చేయడం అభినందనీయమని అన్నారు. టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు జంగయ్య, జిల్లా అధ్యక్షులు చంద్రశేఖర్ రావు, కోశాధికారి సుధాకర్, జిల్లా కార్యదర్శులు కృష్ణ, మండల నోడల్ అధికారి డీవీఎల్ఎన్ మూర్తి, పాఠశాల హెచ్ఎం కృష్ణమోహన్, మండల ప్రధాన కార్యదర్శి కనకయ్య, బాధ్యులు శ్రీధర్, లలిత, నీలకంఠం, పాఠశాల ఉపాధ్యాయులు శేఖర్, లక్ష్మి పావని, అశోక్ పాల్గొన్నారు.

Local News



# నీటి సమస్య రానియ్యకండి

- **ప్రణాలికతో తాగునీటి ఎద్దడి నివారణ చర్యలు**
- **జనగామ జిల్లా తాగునీటి ప్రత్యేక అధికారి గోపి**

**జనగామ, మన చౌరాస్తా:** మంచి నీటి ఎద్దడి నివారణకు పటిష్ట చర్యలు తీసుకోవాలని జనగామ జిల్లా తాగునీటి ప్రత్యేక అధికారి, అగ్రికల్చర్ డైరెక్టర్ బి. గోపి అధికారులకు సూచించారు. శనివారం కలెక్టర్ కార్యాలయంలోని ప్రధాన సమావేశ మందిరంలో తాగునీటి ఎద్దడి నివారణపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమీక్షలో అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పింకేశ్ కుమార్ తో కలిసి జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా తాగునీటి ప్రత్యేక అధికారి బి.గోపి మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం తాగునీటి సమస్య పరిష్కారానికి అత్యంత ప్రాధాన్యత వహిస్తోందన్నారు. జిల్లాలో వేసవి కాలం దృష్ట్యా ప్రజలకు తాగునీరు అందించడంలో క్షేత్రస్థాయిలో అధికారులు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. భూగర్భ జలాలు అడుగంటిపోతున్న నేపథ్యంలో ప్రజలకు తాగునీరు అందించేందుకు మిషన్ భగీరథ స్థానిక నీటి వనరుల ద్వారా ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని వివరించారు. రానున్న రోజుల్లో ఈ తాగునీటి సరఫరాను ప్రణాళికాబద్ధంగా అందించాలని సూచించారు. గ్రామ పంచాయతీ స్థాయిలో సమావేశాలను ఏర్పాటు చేసుకొని తాగునీటి సమస్యలను గుర్తించి వెంటనే తగు జాగ్రత్తలు పాటించాలన్నారు. హ్యాండ్ పుంపులు, బోర్ వెల్స్, తదితర తాగునీటి వనరులను సరైన విధంగా నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్, ఆర్డీఓలు కొమురయ్య, వెంకన్న, జడ్పీ సీఈఓ, ఇన్ చార్జి డీపీవో అనిల్ కుమార్, డీఏవో వినోద్ కుమార్, డీఈఓ రాము, మునిసిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.



## 'స్వీప్'తో ఓటర్లలో చైతన్యం

**జనగామ, మన చౌరాస్తా :** భారత ఎన్నికల సంఘం చేపడుతున్న స్వీప్ ప్రచార కార్యక్రమాలతో ఓటర్లలో చైతన్యం తేవాలని కలెక్టర్ రిజ్వాన్ భాషా షేక్ తెలిపారు. శనివారం కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో భారత ఎన్నికల సంఘం నిబంధనలను పురస్కరించుకొని చేపడుతున్న స్వీప్ ప్రచార కార్యక్రమాల నిర్వహణ తీరును అదనపు కలెక్టర్లు పింకేష్ కుమార్, రోహిత్ సింగ్ లతో కలిసి సంబంధిత అధికారులతో కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. కళాశాలల్లో ఆసక్తి కలిగిన విద్యార్థులను బ్రాండ్ అంబాసిడర్లుగా గుర్తిస్తూ ఫైవ్ కె రన్ వంటి అనేక కార్యక్రమాలు చేపట్టడం జరుగుతుందన్నారు. గ్రామస్థాయిలో మహిళా సంఘాలకుచ పాఠశాల విద్యార్థులకు అవగాహన కార్యక్రమాలు చేపట్టి ఇంటింటికి ప్రచారం నిర్వహించాలన్నారు. మహిళల్లో ఐక్యత నెలకొల్పే దిశగా రంగోలి కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. గ్రామ సమైక్యలు, మెప్మా మహిళలతో సభలు నిర్వహించుకునేందుకు స్టేజీ, మైకు ఏర్పాట్లకు మొబైల్ వ్యాను ద్వారా ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. యువ ఓటర్ల సంఖ్య పెరగాల్సిన అవసరం ఉన్నందున ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు మహిళా ఓటర్ల సంఖ్య పెరగాల్సిన అవసరం ఉందని, పోలింగ్ కేంద్రాల వారీగా ఓటు శాతం తక్కువగా పోలైన ప్రాంతాలను గుర్తించి ఓటు శాతం పెరిగేలా సమావేశాలు ఏర్పాటు చేస్తూ ఆదిశగా అధికారులు కృషి చేయాలన్నారు. ఈ సమీక్ష సమావేశంలో జడ్పీ సీఈవో అనిల్ కుమార్, జనగామ, ఘన్‌పూర్ ఆర్డీవోలు కొమరయ్య, వెంకన్న, స్వీప్ నోడల్ అధికారి వినోద్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## లింగంపల్లికి ఆర్టీసీ బస్సును పునరుద్ధరించాలి

**బచ్చన్నపేట, మన చౌరాస్తా :** బచ్చన్నపేట మండలం లింగంపల్లి గ్రామానికి ఆర్టీసీ బస్సును పునరుద్ధరించాలని కోరుతూ సీపీఎం ఆధ్వర్యంలో జనగామ ఆర్టీసీ డిపో అసిస్టెంట్ మేనేజర్‌కు పార్టీ మండల ఇన్‌చార్జి సుంచు విజేందర్ వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా విజేందర్ మాట్లాడుతూ గతంలో గజ్వేల్ ప్రజ్ఞాపూర్ డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు లింగంపల్లి మీదుగా హైదరాబాద్‌కు, చేర్యాలకు వెళ్లేదని, అట్టి బస్సు ప్రస్తుతం రావడం లేదన్నారు. జిల్లా కేంద్రానికి, మండల కేంద్రానికి వెళ్లాలంటే చేర్యాల మీదుగా జనగాం జిల్లా కేంద్రానికి రావాల్సి వస్తోందన్నారు. మండల కేంద్రానికి రావాలంటే చేర్యాలకు వెళ్లి బచ్చన్నపేటకు రావాల్సి వస్తుందన్నారు. ఏదైనా అత్యవసరం ఉంటే ప్రైవేట్ వాహనాల్లో వెళ్లాలంటే వందలాది రూపాయలు వెచ్చించాల్సి వస్తుందన్నారు. ప్రస్తుతం ఉదయం నుంచి రాత్రి వరకు స్కూల్ పిల్లల కోసం ఒక్క ట్రిప్పు మాత్రమే నడుస్తోందని, స్కూల్, కాలేజీ పిల్లలు కూడా ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ఇప్పటికైనా లింగంపల్లి నుంచి బచ్చన్నపేట మీదుగా జనగామ జిల్లా కేంద్రానికి ఒక రోజుకు రెండు ట్రిప్పులు నడిచే విధంగా ఆర్టీసీ అధికారులు చర్యలు తీసుకోవాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఎం మండల కమిటీ సభ్యులు వెంకటవ్వ, అన్నబోయిన రాజు, తాడెం రాములు, పొన్నాల రాజవ్వ తదితరులు పాల్గొన్నారు





## ఇమామ్‌లకు సరుకుల పంపిణీ

**జనగామ, మన చౌరాస్తా :** రంజాన్ మాసం సందర్భంగా హం సాత్ ఫౌండేషన్ జనగామ ఆధ్వర్యంలో దాతల సహకారంతో హంసాత్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు మహమ్మద్ యాకుబ్ పాషా జిల్లాలో పలు మారుమూల గ్రామాల మజీద్ ఇమామ్ లకు నెలకు సరిపడే నిత్యవసర సరుకులు అందజేస్తున్నారు. ఈ సందర్భంగా శనివారం మహమ్మద్ యాకుబ్ పాషా మాట్లాడుతూ.. ఈ రంజాన్ మాసంలో ఇప్పటికే జనగామ జిల్లా వ్యాప్తంగా చాలా వరకు మారుమూల గ్రామాల్లో ఉన్నటువంటి మజీద్ లకు ఇఫ్తార్ లో భాగంగా ఫ్రూట్స్ పంపిణీ కార్యక్రమం చేపట్టడం జరిగిందన్నారు. ప్రతి ఒక్కరూ పేద మధ్యతరగతి మైనార్టీలకు అండగా నిలవాలని కోరారు. మజీద్ ఈద్గా ఖబరిస్తాన్ ల అభివృద్ధికి ముందుకు రావాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సయ్యద్ రిజ్వాన్, ఆసిఫ్, షరీఫ్, యాకూబ్ (మెకానిక్), నెల్లుట్ల మజీద్ సదర్ సర్దార్, మజీద్ ఇమామ్, అబ్దుల్ కలాం ఆజాద్, ఆర్టీసీ కాలనీ మజీద్ ఇమామ్ మహమ్మద్, ఇమ్రాన్ అహ్మద్, పోచన్నపేట మజీద్ ఇమామ్ ముక్తార్ పాషా, రిజ్వాన్, అబ్దుల్ రహీం, పలు గ్రామాల మజీద్ ఇమామ్‌లు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా బీజేపీ ఆవిర్భావ దినోత్సవం

**బచ్చన్నపేట, మన చౌరాస్తా:** భారతీయ జనతా పార్టీ 44వ ఆవిర్భవ దినోత్సవాన్ని బీజేపీ మండల అధ్యక్షులు చిమ్ముల నరేందర్ రెడ్డి ఆద్వర్యంలో బచ్చన్నపేటలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల ఉపాధ్యక్షులు పెండం నగేష్, మండల సీనియర్ నాయకులు కురెళ్ల వెంకట్ రెడ్డి, దొంతుల చంద్రమౌళి, బిజెవైఏం మండల ప్రధాన కార్యదర్శి గణేష్, నాయకులు నరేష్, కిషన్, అంజయ్య, బాలరాజు, ఎల్లయ్య, తదితరుల పాల్గొన్నారు.

## విద్యుత్ షాక్‌తో ఒకరి మృతి



**పాలకుర్తి, మన చౌరాస్తా :** ఎలక్ట్రిసిటీ డిపార్ట్‌మెంట్‌లో కట్టర్ గా పనిచేస్తున్న శ్రీశైలం కరెంట్ షాక్ తో మృతి చెందాడు. పాలకుర్తి మండలం వల్మిడి గ్రామంలో శనివారం జరిగిన ఈ ఘటన వివరాలు ఇలా ఉన్నాయి. వల్మిడి గ్రామంలో విద్యుత్ మరమ్మతుల కోసమని శ్రీశైలం ఎల్‌సీ తీసుకున్నాడు. కానీ తాను పని చేయాల్సిన ట్రాన్స్ ఫార్మర్ కు వేరే ఫీడర్ నుంచి విద్యుత్ వస్తుందని గుర్తించలేదు. ఎల్‌సీ తీసుకున్నాననే ధైర్యంతో రిపేర్ చేసేందుకు వెళ్లగా విద్యుత్ షాక్ తో అక్కడికక్కడే మృతి చెందాడు.

# బట్లర్ బ్లాసింగ్




- బెంగళూరుపై రాజస్థాన్ విజయం
- కింగ్ కోహ్లీ 113 నాటౌట్
- రాజస్థాన్ ముందు 184 టార్గెట్
- ఈజీగా చేధించిన ఆర్ఆర్
- బట్లర్ (100) సూపర్ సెంచరీ
- రాజస్థాన్ ఖాతాలో వరుసగా నాలుగో విజయం
- ఆర్సీబీ ఖాతాలో నాలుగో ఓటమి
- ఒకే మ్యాచ్ లో రెండు శతకాలు

**శనార్తి తెలంగాణ, క్రీడా విభాగం :** క్రికెట్ లో వన్ మెన్ షో పనికిరాదు. టీమ్ వర్క్ ఉండాలని మరోసారి నిరూపితమైంది. తాజా ఐపీఎల్ సీజన్ లో తొలి సెంచరీ నమోదు చేస్తూ.. కింగ్ కోహ్లీ (113*) అదరగొట్టాడు. ఫలితంగా ఆర్ఆర్ ముందు ఆర్సీబీ 184 పరుగుల టార్గెట్ ఉంచింది. ఈ భారీ టార్గెట్ ను 4 వికెట్లు కోల్పోయి ఐదు బంతులు మిగిలుండగానే రాజస్థాన్ ఛేదించింది. దీంతో రాజస్థాన్ ఖాతాలో వరుసగా నాలుగు విజయాలు నమోదు కాగా.. ఆర్సీబీ ఖాతాలో నాలుగు పరాజయాలు నమోదయ్యాయి.
టాస్ ఓడి మొదటి బ్యాటింగ్ చేసిన బెంగళూరు నిర్ణీత 20 ఓవర్లలో 3 వికెట్ల నష్టానికి 183 పరుగులు చేసింది. విరాట్ కోహ్లీ (113*; 72 బంతుల్లో 12 ఫోర్లు, 4 సిక్సులు) శతకం బాదాడు. ఈ సీజన్‌లో నమోదైన మొదటి సెంచరీ ఇదే. కింగ్ కోహ్లీ కి తోడుగా డుప్లెసిస్ (44; 33 బంతుల్లో 2 ఫోర్లు, 2 సిక్సులు) రాణించాడు. వీరిద్దరు కలిసి తొలి వికెట్‌కు 125 పరుగుల భాగస్వామ్యాన్ని నెలకొల్పడం విశేషం. 14 ఓవర్ వరకు ఆర్సీబీ ఒక్క వికెట్ కూడా పడలేదు. అయితే డుప్లెసిస్ అవుటైన తర్వాత వచ్చిన ఆటగాళ్లు టాప్ గేర్ లో ఆడకపోవడంతో ఆర్సీబీ స్కోర్ 200 దాటలేదు. రాజస్థాన్ బౌలర్లలో యుజ్వేంద్ర చాహల్ 2, నంద్రి బర్గర్ ఒక వికెట్ పడగొట్టారు.

అనంతరం 184 పరుగుల లక్ష్యాన్ని రాజస్థాన్ నాలుగు వికెట్లు కోల్పోయి మరో ఐదు బంతులు మిగిలుండగానే ఛేదించింది. ఓపెనర్ యశస్వి జైస్వాల్ (0) విఫలమైనా.. మరో ఓపెనర్ జోస్ బట్లర్ (100*; 58 బంతుల్లో 9 ఫోర్లు, 4 సిక్సులు) చివరి దాకా క్రీజులో ఉండి జట్టు గెలిపించాడు. బట్లర్ కి తోడుగా సంజు శాంసన్ (69; 42 బంతుల్లో 8 ఫోర్లు, 2 సిక్సులు) అర్ధ శతకంతో రాణించాడు. బెంగళూరు బౌలర్లలో రీస్ టాప్లీ 2, యశ్ దయాల్, సిరాజ్ ఒక్కో వికెట్ పడగొట్టారు. కింగ్ కోహ్లీ సెంచరీ చేసినా ఆర్సీబీ మ్యాచ్ ఓడిపోవడంతో అభిమానులను నిరాశకు గురి చేసింది.

